# పునర్జన్మ

"ఈ సామానెవరిది"?

రాత్రి పదిగంటలకు హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చిన రవీంద్ర భార్యనడిగాడు.

''కాశి ఢిల్లీ నుంచి భార్యా పిల్లవాడితో వచ్చాడు. వాడికి జ్వరం వస్తోందట. నెల రోజులనుంచీ మందులు వాడుతున్నాడట. కాని జ్వరం తగ్గటం లేదట. ఏడాది సెలవుపెట్టి సామాన్లు తీసుకుని వచ్చాడు. వాళ్లు వచ్చేసరికి ఎనిమిది గంటలయింది." అని భోజనాల యింట్లోకి వెళ్ళింది-సుమిత్ర.

"ఏం జ్వరమది? నెల రోజులనుంచీ తగ్గక పోవటమేమిటి? ఏడాది సెలవు తీసుకోవటమేమిటి? అన్ని సంగతులూ వివరంగా అడగద్దూ ?" కనుబొమలు ముడిచి కోపంతో అన్నాడు.

"వాడిని ఏమని అడగను? జ్వరంతో బాధపడుతూ రాగానే పడక్కుర్చీలో పడుకున్నాడు. ముఖం వాడిపోయింది. గబగబా ఒక కప్పు పాలు వేడిచేసి ఇచ్చాను. కాస్త స్థిమిత పడినట్టు కనబడ్డాడు. పైన పక్కలేయించి, ఆ పడక్కుర్చీని అలాగే పని వాళ్ళను పైకి తీసుకు రమ్మని చెప్పి, కూడా వెళ్ళాను. పలకరిస్తే ''పడుకుంటానమ్మ అలసటగా ఉందన్నా"డు. కొంచెంసేపు కూర్చుని కిందికి వచ్చాను.

"సంగతేమిటో కోడల్ని అడగక పోయినావా?" ఆందోళనకొద్ది గట్టిగా అరుస్తున్నాడు.

"కోడలు మాత్రం ఏం చెబుతుంది? ఆమె చెప్పిన మాటలే-నెల రోజుల నుంచీ జ్వరమనీ ఏడాది సెలవు పెట్టాడనీను."

"నిద్ర పోతున్నారా అందరూ?"

"అవును ఢిల్లీ నుంచి రైల్లో ప్రయాణంచేసి వస్తే బడలికగా ఉండదూ? 'రేపు మాట్లాడు కుందామని నేనే అన్నాను. కాశికి బ్రెడ్ కావాలంటే తీసి ఇచ్చాను. పైకి తీసుకు వెళ్ళింది. కోడలు ఇప్పుడే.

''వాడు వచ్చాడని నాకు ఎందుకూ ఫోన్ చేయ్యలేదూ? నాకు తెలిస్తే తొందరగా వచ్చేవాడినిగా?''

"వాళ్ళకేంకావాలో అడిగి అమర్చటంతోనే సరిపోయింది. ఆ అడావుడిలో మీకు ఫోన్ ఎప్పుడు చేసేది? అందులో-మీరూ ఎమర్జెన్సీ అనుకుంటూ వెళ్ళారు. చేస్తే ఏమోనని చెయ్యలేదు."

"ఇదిగో సుమిత్రా! నీవు ఫోన్ చేసినట్లయితే ఎమర్జెన్సీ అయినా ఏదో ఏర్పాటుచేసి వచ్చేవాడిని. అసలు నీకు-నాకు ఫోన్ చెయ్యాలని తోచలేదు. ఆమాట చెప్పక-ఎమర్జెన్సీ అన్నావని నా మీదకే తోసేస్తున్నావు. నీవు ఫోన్‌లో ఎన్ని సార్లు వట్టి కబుర్లతో నన్ను బోర్ కొట్టించలేదూ? తెల్లవారి వాడు లేస్తేగాని నాకు వివరాలు తెలియవు. ఒకరోగి జీవితంలో పదిగంటల కాలపు అయోమయస్థితిని, డాక్టర్నయి ఉండీ నేను భరించగలిగేది. అసలు రెప్పపాటు కాలంలో తెలుసు కొనవలసినమాట. నాకెంత ఆందోళనగా ఉందో నీకర్థం కావటం లేదు. ఇదంతా నీవు ఫోన్ చేయకపోవటం వల్ల జరిగినది" ఆవేశంతో తన గదిలోకి వెళ్ళాడు బట్టలు మార్చుకుని చల్లటి నీళ్ళతో ముఖం కడుక్కుని భోజనాల బల్ల దగ్గరికి వచ్చాడు. చల్లటినీళ్లు తగలగానే ఆవేశం కొంచెం తగ్గింది. మాట్లాడ కుండా కూర్చున్నాడు.

సుమిత్ర అంతకంటె మాట్లాడకుండా ఇద్దరికీ వడ్డించింది.

కూరతో చపాతీ తింటూ "అయితే బాబు ఎట్లా ఉన్నాడు? ఏం చదువు తున్నాడట?"

"వాడి చదువు సంగతి ఎవరు అడిగారు? కాశి సంగతి చూడటంతోటే సరిపోయింది. వాడు నడిచి మెట్లెక్కలేడని ఆ కుర్చీనే పైకి తీసుకు వెళ్ళమన్నాను పనివాళ్లను. వాడు పక్కమీద పడుకోగానే ఎట్లా ఉందని పలకరించాను"

"నాకు ముందు నిద్ర వస్తోందని'' పడుకున్నాడు. దుప్పటి కప్పి నేను కిందికి వచ్చాను. కోడలికి పిల్లవాడికి భోజనాలు పెట్టి పైకి పంపించాను."

రవీంద్రకు మనసంతా చికాగ్గా ఉంది. 'నెల రోజుల నుంచీ జ్వరమా! మనిషి తీసిపోయి ఉంటాడు. తెల్లవారిన తరువాత గాని హాస్పిటల్‌కి తీసుకువెళ్ళి పరీక్ష చేయించటానికి వీలుకాదు.' అనుకుంటూ 'ఆ రేపటి ప్రోగ్రామ్‌ను' ఒక డైరీలో రాసుకున్నాడు. మరొక డైరీలో కాశి వచ్చిన సంగతి అతడికి జ్వరం వస్తున్న సంగతి సుమిత్ర తనకు ఫోన్ చెయ్యని విషయం రాసుకున్నాడు.

భోజనాల బల్ల దగ్గర జరిగిన సంభాషణతో మనసు మూగవోయినట్లయింది రవీంద్రకు. పక్కమీద పడుకుని చెయ్యి ముఖానికి అడ్డంగా పెట్టుకున్నాడు.

కొంత సేపటికి ఇంట్లో తలుపులన్నీ వేసి, లైట్లూ ఫేన్లూ ఆర్పేసి, గదిలోకి వచ్చింది సుమిత్ర. చిన్న దీపం పెట్టి, పెద్ద దీపం తీసేసింది. ఫేన్ పెట్టి తన మంచమ్మీద పడుకుంది.

ఆయన నిద్ర పోవటం లేదనీ, ఏదో ఆలోచిస్తున్నాడని ఆమె గ్రహించింది. అతడిని మాట్లాడించే ధైర్యం ఆమెకు లేదు. రవీంద్ర అన్నట్టు వాళ్లు రాగానే తను ఫోన్ చేస్తే ఆయన వచ్చి చూసి, హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళేవారేమో? ఈ పాటికి ఏం జబ్బో తెలుసుకుని మందు ప్రారంభించే వారేమో?

కాని శల్యావశిష్టంగా ఉన్న కొడుకును చూడగానే తనకు మతిపోయినట్లయింది. కొంత సేపటి వరకు ఒంటిమీద స్పృహ లేకుండా పోయింది. తరువాత మెల్లగా లేచి, కాశి పడుకున్న కుర్చీ దగ్గరకెళ్ళి అతడి చెంప మీద చెయ్యివేసి చూసి, "ఎంత నీరసించి పోయావురా?" అంటూ కంటికి కడివెడు నీళ్ళుగా ఏడ్చింది. అసలే ఆమెకు గుండెదడ. కొడుకును చూడగానే మరీ ఎక్కువయింది. తనలో తానే సర్దుకుని వచ్చిన వాళ్ళ సంగతి చూసింది.

ఈ సంగతులన్నీ ఆయనతో ఎట్లాచెబుతుంది? చెప్పలేక కన్నీళ్ళు కార్చింది పడుకుంది.

రవీంద్ర కూడా నిద్ర పోలేదు. కొడుకు జ్వరాన్ని గురించీ ఆలోచిస్తున్నాడు. అక్కడ డాక్టరు ఏమనుకుని వైద్యం చేస్తున్నాడు? నెలనుంచీ జ్వరం వస్తుంటే ఆ సంగతి తనకు ఉత్తరం కొడుకు రాయకూడదూ? తను వెళ్ళి తీసుకు వచ్చేవాడుగా?

వాడు రాయకపోయినా కోడలు రాయవచ్చు. ఏమిటో అంతా అయోమయంగా ఉంది.

తెల్లవార్లూ ఇద్దరికీ నిద్రలేదు. ఒకరితో ఒకరు మాట్లాడటానికి భయంగా 'కాశీ చాలా చిక్కిపోయాడ'ంది సుమిత్ర. ఏమిటో సంగతి? అని అతడు ఆలోచనలో ఉన్నాడు.

'ఆయన అన్నట్టు తను టెలిఫోను చేస్తే బాగుండేది' అని ఆమె మధన పడుతున్నది.

ఇద్దరూ ఆలోచించిన విషయాన్నే తిరిగి మధించడం జరుగుతోంది.

గడియారం ఐదు గంటలు కొట్టింది.

కోడలు కిందికి దిగి వచ్చి ఫ్రిజ్ తెరిచింది పాలకోసం. ఆమెకు కనబడ లేదు. గిన్నెలన్నీ తీసి చూస్తున్నది.

ఆ చప్పుడికి సుమిత్ర లేచింది.

"ఏం కావాలమ్మా?" అడిగింది.

ఆయన లేచారు. నీరసంగా ఉందంటే పాలు ఇద్దామని వచ్చాను''

దిగ్గున లేచి వచ్చాడు రవీంద్ర.

"వాడు లేచాడా? పాలు కాదు. నీరసంగా ఉంటే హార్లిక్సు కలిపి ఇవ్వు. వేడినీళ్లు ఫ్లాస్కులో ఉన్నాయి. నేను కూడా వస్తున్నానని చెప్పు-ముఖం కడుక్కొని వస్తాను'' అంటూ బాత్‌రూములోకి వెళ్ళాడు.

కోడలు రాజీ హార్లిక్సు కలిపి చల్లార్చి అతడికి ఇచ్చింది. అంతలో రవీంద్ర పైకి వెళ్ళాడు. మంచానికి దగ్గరగా కుర్చీలాక్కొని కూర్చున్నాడు.

అతడికి హార్లిక్సు తాగిన ఆయాసం తగ్గిన తరువాత-"కాశీ, ఎన్నాళ్ళనుంచీ ఈ జ్వరం నీకు"? అడిగాడు.

"నెలకు పైగా అయింది. అక్కడ డాక్టరు దగ్గర మందు తీసుకుంటున్నాను తగ్గటంలేదు."

"అయితే నాకు ఉత్తరం రాయకపోయావా?''

''పట్టి జ్వరమే కదా పోతుందనుకున్నాను నానా''

"నేను హాస్పిటల్‌కి వెళ్ళేటప్పుడు నీవు కూడా నాతో రా. అన్ని పరీక్షలు చేయించుతాను. ఎందుకు జ్వరం వస్తున్నదో తెలుసుకుని వైద్యం చేస్తారు''

''అందుకే నీ దగ్గరికి వచ్చాను నాన్నా.'' అన్నాడు. ఎనిమిది గంటలకు కాశీని హాస్పిటల్‌కి తీసుకువెళ్లి రక్త పరీక్ష చేయించి ఎక్సురే తీయించాడు. ఎక్సరేలో తేలింది అతడి కాజ్వరం ఎందుకు వస్తున్నదీను.

దానికి సంబంధించిన డాక్టరు వచ్చి రవీంద్రతో చెప్పగానే కుర్చీలో కూలబడి పోయాడు.

''డాక్టర్ రవీంద్రా మీకూ అంతా తెలుసు. ఇప్పుడు ఈ జబ్బుకు మంచి మందులు వచ్చాయి మీరు హాస్పిటల్లో చేర్పించండి. ఆరోగ్యం బాగుపడుతుంది. మామూలు మనిషైపోతాడు. డాక్టరై ఉండి మీరు దిగులు పడతారేమిటి?'' అని తోటి డాక్టర్లు ధైర్యం చెప్పి హాస్పిటల్లో చేర్పించారు.

హాస్పిటల్లో వరెండాలో ఒకగది బాత్‌రూమ్ గల భాగాన్ని అతడికి ప్రత్యేకంగా ఇచ్చారు. అతడి దగ్గర భార్య రాజి ఉంటున్నది. ఆ హాస్పిటల్ ఊరికి చాలా దూరాన ఉన్నది. అయినప్పటికీ రవీంద్ర రోజూ వెళ్ళి చూసి వస్తూ ఉండేవాడు. ఆహాస్పిటల్ డాక్టర్లు రోగిని చాలాబాగా చూస్తూ వైద్యం చేస్తున్నారు. త్వరలోనే వాళ్ళిచ్చిన ట్రీట్ మెంటు వల్ల జ్వరం తగ్గింది. ఇంజక్షన్ లిచ్చేవారు. పాలు కోడిగుడ్లు మొదలైన పుష్టికరమైన ఆహారం ఇవ్వటం మొదలు పెట్టారు. కాశీకి ఇంజక్షనుల వల్ల ప్రాణం వచ్చినట్లయింది

అతడిప్పుడు జబ్బుపూర్తిగా నయం కాకపోయినా మామూలు మనిషిగా కనుపిస్తున్నాడు. మంచి మందులు వాడుతున్నందువల్ల వ్యాధి తిరుగు ముఖం పట్టింది. మూడు నాలుగు నెలలయ్యేసరికి అతడి కెంతో బలం వచ్చినట్లనిపించసాగింది.

బాబూను స్కూల్లో చేర్పించారు. సుమిత్ర దగ్గర బాగా అలవాటయ్యాడు. కావలసినవి అడిగి చేయించుకుంటున్నాడు. సుమిత్ర కూడా కొడుకును అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్ళుతున్నది. ఆమెకు కొడుకు ఆరోగ్యాభివృద్ధిని చూసి చాలా సంతోషం కలిగింది.

డాక్టరు రవింద్ర అతడిని ఇంటికి పంపమని అడిగితే అక్కడి డాక్టర్లు "జబ్బు నయమవుతున్నది.—మీరు తీసుకువెళ్ళి సాయంత్రానికి పంపండి. మా

సమక్షంలో కొంతకాలం రోగి ఉండాలని'' సలహా ఇచ్చారు. ఎప్పుడైనా ఇంటికి వచ్చి తన కొడుకును చూసి సంతోషిస్తూ ఉండేవాడు కాళి. అతడి తండ్రికి కూడా ఆనందంగా ఉండేది. తల్లి కొడుకు దగ్గరే ఉంటోంది కోడలు వచ్చి చూసిపోతూ ఉండేది. వారం రోజులు అలా జరిగిన తరువాత తల్లి ఇంట్లో కోడలు హాస్పిటల్లో ఉంటున్నారు.

ఒకనాడు రాజితనకొడుకును చూడటానికి ఇంటికివెళ్ళింది. ఆ సాయంత్రం అమె తిరిగి హాస్పిటల్‌కి వెళ్లేసరికి కాళి చాలా ఉల్లాసంగా ఉన్నట్టు కనబడ్డాడు. ఆ మరునాడు కూడా అతడు చాలా ఆరోగ్యంగా ఉన్నట్టు కనబడ్డాడు. తల్లి దండ్రులకూ భార్యకూ జబ్బు పూర్తిగా తగ్గిపోయిందన్న సంతోషం కలిగింది.

కాళికి ఒకనాడు ఉన్నట్టుండి జ్వరం వచ్చింది. డాక్టరుకి సందేహం కలిగింది. మంచి మందులు ఇస్తున్నారు. ఇంజక్షన్లులు ఇస్తున్నారు. ఇతడికి మళ్ళీ జ్వరం ఎందుకు వచ్చిందన్న సందేహంతో ఎక్సురే తీశారు. ఎక్సురే అప్పుడప్పుడు తీసి వ్యాధి ఏస్థాయిలో ఉన్నదీ వాళ్లు చూస్తునేఉన్నారు. డాక్టరు రవీంద్రకు కూడా చూస్తున్నారు. ఈ సారి తీసిన ఎక్సురే ఇదివరకువలెలేదు. వాళ్ళకు ఇతడు తాగుతున్నాడన్న అనుమానం కలిగింది. ఊపిరితిత్తులు ఇదివరలో తీసిన ఎక్సురేలో ఉన్నట్టుగాలేవు.

తండ్రి వచ్చినప్పుడు చెప్పారు-"ఇతడు ఏదోడ్రింకు తీసుకుంటున్నట్టు మాకు అనుమానంగాఉంది. ఇదివరకూ ఎక్సురేతీసినప్పుడు ఊపిరితిత్తులు ఇంచు మించుగా యథాస్థితికి వచ్చినట్టు కనబడ్డాయి. కాని ఈ మధ్య, వాటిలో వ్యత్యాసం కనుపిస్తున్నది. ఆ అలవాటువల్లనే అతడి ఊపిరితిత్తులు చెడిపోయాయి. సన్నటి కేవిటీస్ (చిల్లులు)కూడా మళ్లీ బయటపడ్డాయి.''

ఎక్కిన కొండమీదినుంచి హఠాత్తుగా కిందికి దొర్లిపోయినట్లయింది రవీంద్రకు

తనకు గడిచిన పదిరోజులనుంచీ కలిగిన సంతోషమంతా తాత్కాలిక మేనా? ఇది మళ్ళీ వెనక్కు తిరుగుతుందా?

కాళికి డబ్బు ఎక్కడిది? డ్రింక్ బాటిల్ ఎవరు తెచ్చిస్తున్నారు?

రాజి కాదుకద? అయినా రాజి ఇంత తెలివిహీనురాలా?

ఇంటికిరాగానే రాజిని పిలిచాడు. ఆమె భయపడుతూ వచ్చింది.

"నీవు కాళిదగ్గర డబ్బు ఉంచావా?"

"లేదండి"

"అదికాకపోతే ఇంకోమాట కాళికి తాగే అలవాటుందా?"

"ఆసంగతి నాకు ఎలా తెలుస్తుందండీ?"

"డబ్బు ఎలా ఖర్చు చేస్తున్నాడు ఇంతకాలంనుంచీ? జేబులో బాగా డబ్బు పెట్టుకుని బైటికి వెళ్ళేవాడా? జీతం ఇంట్లో ఇచ్చేవాడా? నెలకువచ్చేజీతం సరి పోతోందా?" ఆమెను నిలవదీసి అడుగుతున్నాడు రవీంద్ర.

అయినా ఇప్పుడు ఎందుకు అడుగుతున్నారో ఆమెకు అర్థం కావటంలేదు.

"తలవంచుకోవటంకాదు. కాళి పర్సులో డబ్బు ఇప్పుడుఉంటోందా? ఇదయినా చెప్పు?"

"అప్పుడప్పుడు పనివాళ్ళకు ఈనామ్‌లు ఇవ్వాలని పాతిక, ముప్ఫయి తెప్పించుకుంటున్నారు."

"నీ చేతనా? వాళ్ళఅమ్మ చేతనా?"

"నాకే చెప్తున్నారు డబ్బు తీసుకురమ్మనమని. తీసుకువెళ్ళకపోతే కోప్పడ తారు. నా డబ్బు నాకు తెచ్చియివ్వటానికి నీకేమభ్యంతరం?" అంటారు.

"వాడికి డ్రింక్ తీసుకునే అలవాటుందనీ దానివల్లనే జబ్బు తిరగబెట్టిందనీ డాక్టర్లు అంటున్నారు. డ్రింక్ అలవాటుందని నీకు తెలుసుననుకుంటాను నిజమేనా? అబద్ధాలు అల్లిచెప్పకు''

రాజి ఆయన ముందరే కూలబడిపోయింది. మామగారితో ఇక చెప్పక తప్పదనుకుంది.

"దీనికోసమేనండీ మా యిద్దరి మధ్య తగవులాటలు ఎక్కువైనాయి. ఈ సంగతి ఎత్తగానే కొట్టినంతపనిచేస్తారు. క్లబ్బునుంచి రాత్రిళ్ళు పొద్దుపోయి వస్తారు. కారణమడిగితే మాట్లాడరు. నేనశక్తురాలనయిపోయాను మామగారూ? అత్తగారికి ఉత్తరంరాద్దామనుకున్నాను. కొడుకుమీదరాస్తే ఆమె నమ్మకపోవచ్చు.

నామీద విరోధంకూడా కలగవచ్చనుకున్నాను. ఒక్కొక్కరోజు అన్నం నీళ్లూ లేకుండా ఏడ్చేదాన్ని. కాని వాటి పరిణామం ఇంటికి వట్టిజేబులతో వచ్చేవారు. నేను ఆరుజతల గాజులతో ఢిల్లీ వెళ్ళాను. ఇప్పుడు ఒక్కటేజతఉంది. రాగానే అత్తగారు అడిగారు-"ఏమిటానాజూకు? చేతినిండాగాజులు వేసుకునేదానవు. బాగుం దనుకునేదాన్ని" అన్నారుకూడా. "ఆయన ఎక్కడోతింటారు - తిరుగుతారు మేమిద్దరం ఇంట్లో ఉంటాంకదా? అందులో బాలూ చదువు. చదువుచిన్నదయినా ఖర్చులెక్కువ. నేను ఏంచెయ్యను?" మామగారి ముందర కుమిలి కుమిలి ఏడ్చింది.

"ఇప్పుడెందు కేడుస్తావమ్మా? నీవు చేతనైనంత పోరాడేవు. ఇప్పుడు ఈ పరిస్థితులలో వాడు డబ్బు తీసుకురమ్మన్నా లేదనిచెప్పు" ఆయన విసురుగా హాస్పిటల్ కి వెళ్ళిపోయాడు.

వంటచేసి అతడికి పంపటమేగాని రాజిని హాస్పిటల్ కి వెళ్ళద్దని రవీంద్ర ఆపేశాడు.

"అమ్మా నాకు పాఠంచెప్పటానికి ఇంట్లో ఉంటున్నావా?" బాలు అడిగితే ఆమె కళ్ళనీళ్ళు కనబడనీయకుండా, అవునని పాఠాలు చెబుతున్నది.

"పోనీ రాజీ రెండురోజులు నీవుండరాదూ వాడిదగ్గర? రెండు మూడుసార్లు అడిగాడుకాశి" అన్నది అత్తగారు ఒకనాడు ఇంటికివచ్చి.

"బాలూ దిగులుపడుతున్నాడు మామగారితో చెప్పండి. ఎవరినయినా పంపు తారు. మీరు రెండురోజులు రెస్టుతీసుకోండి" అన్నది అత్తగారితో.

"అలా అంటే ఎలాగే? నేను కాకపోతే నీవు ఉండాలి. అన్నట్లు మర్చి పోయాను. వార్డుబాయ్‌లు ఈనాములడుగుతున్నారట. డబ్బు చేతిలోవడెయ్యకపోతే పిలిస్తే పలకరట. నీతో చెప్పమన్నాడీమాట" అన్నది స్నానానికి వెళ్ళుతూ.

ఆ ఉదయమే డాక్టరు రవీంద్ర చెప్పినందువల్ల నలుగురు వార్డుబాయ్‌స్ కి మరొకవార్డుకి ట్రాన్సరయింది. వాళ్ళు కనబడలేదని కాశికి ఏమిటోగాఉంది. చికాకనిపిస్తున్నది. ఎందుకో కోపంవస్తున్నది. తనను చూడటానికివచ్చిన డాక్టరు "మమ్మల్ని అడగనిదే మీరు మంచినీళ్లయినా తాగకూడదని పెద్ద డాక్టరుగారు చెప్పమన్నారు?" అన్నాడు.

"మంచినీళ్ళుకూడా అడిగేతాగాలా? అయితే ఇటువంటి వైద్యం నాకవసరం లేదు" అన్నాడు తీవ్రంగా.

ఆ డాక్టరు వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

ఇంటికి వెళ్ళేటప్పుడు డాక్టరు రవీంద్ర ఇద్దరు డాక్టర్లతో వచ్చాడు గదిలోకి.

"ఎట్లాఉంది కాశీ! ఈపూట? భోజనంచేశావని నర్సుచెప్పింది" అన్నాడు తండ్రి.

పచ్చివెలక్కాయ గొంతులోపడ్డట్టయింది కాశికి.

"నాకు ఈ ఆరు నెలలనుంచీ ఇక్కడఉండి విసుగుపుట్టింది. ఒకసారి బాగుందనీ, ఒకసారి బాగాలేదనీ వీళ్ళ రిపోర్టులు ఏమిటో నాకర్థం కావటంలేదు. ఆ మందులేవో రాసియివ్వమనండి. నేను ఇంట్లోనేఉండి మందు దీసుకుంటాను. కావాలంటే చెకప్‌కివస్తాను వారం వారం. ఇంకా నేనిక్కడేఉంటే జబ్బుతోచావను గాని వీళ్ళ నియమాలతో చస్తాను. మంచినీళ్ళుకూడా వాళ్ళనడిగి తాగాలంటే నావల్లకాదు " అన్నాడు ముఖం పక్కకుతిప్పుకుని.

"సరే నేను పెద్ద డాక్టర్‌తో మాట్లాడతాను. అయినా నీవు డాక్టర్లమీద కోపంతెచ్చుకోకూడదు. ఇల్లువేరు-హాస్పిటల్ వేరు. ప్రతి విషయం డాక్టర్ని సంప్రతించటానికి వీలుగాఉంటుంది ఇక్కడ. ఇంట్లో ఎవరుఉంటారు? ఇంత చదువుకున్నావు నీకు నేను చెప్పాలా? అబ్బాయీ, ఇది క్షయవ్యాధి నీకు ఊపిరితిత్తులలో చిన్నచిన్న రంధ్రాలు ఏర్పడ్డాయి అవి మూసుకుపోయేటందుకే నిన్నిక్కడికి తీసుకువచ్చింది. ఆ మధ్య ఇంజక్షనులవల్ల మూసుకుపోయాయి. అందుకే నిన్ను రెండుసార్లు ఇంటికి తీసుకువచ్చాను. కాని-ఆ రంధ్రాలు మళ్ళీ ఎక్సురేలో కనబడ్డాయి మొన్న. అందుకని డాక్టరు ఆమాట అనిఉంటాడు. మనం అర్థం చేసుకోవాలి-వాళ్ళు ఎందుకన్నారోనని" అన్నాడు మెల్లగా తలమీద చేత్తోరాస్తూ.

''అయితే రాజీనికూడా వాళ్ళే రావద్దన్నారా? ఎంత అమానుషం!"

"అది అమానుషంకాదు. నీకోసమే నీమంచికోసమే తెలిసిందా? ఇంక అమ్మకూడారాదు."

"మరి-ఇక్కడెవరుంటారు?"

"నాకు తెలిసిన ఆయన ఒకరు రోజూ ఏదోపని ఇప్పించమని తిరుగుతున్నాడు ఆయనను నీదగ్గర ఉంచుతాను. రోజుకు ఐదురూపాయలిచ్చి భోజనం పెట్టితే-చాలంటాడు పంపనా?"

"అదీ బాగానేఉంటుంది అలాచెయ్యండి" అన్నాడు.

ఆ వచ్చినతడు పోలీసు ఇన్‌స్పెక్టరుగా రిటైరయ్యాడు. చాలామంది పిల్లలు. పెద్దపనులు చేయలేడు.

ఆయనకు పగలు ఒకగంట పడుకునేఅలవాటు. ఆయన పడుకున్నంతలో కాశీ ఒక పని చేశాడు. ప్రత్యేకమయిన గదుల్లో ఉండేవాళ్ళకు హాస్పిటల్ డ్రెస్ కాకుండా మామూలుగా ఇంటినుంచి తెచ్చుకున్న బట్టలు తీసుకోవచ్చు. ఇస్త్రీ బట్టలు వేసుకుని పక్కకింద పెట్టుకున్న డబ్బు తీసుకుని గబగబా బజారుకు వెళ్ళి ఒక బుడ్డీకొని అక్కడే ఖాళీచేసివచ్చి పడుకున్నాడు. అతడికి బాగా నిద్రపట్టింది.

ఆ సాయంత్రం నైట్ డ్యూటీ డాక్టరు వచ్చాడు. అతడినిచూసి పలకరించి వెళ్ళాడు.

మరునాడు పెద్దడాక్టరు వచ్చి ఎక్సురేతీయించి డాక్టరు రవీంద్ర రాగానే చూపించాడు.

సన్నగాఉన్న రంధ్రాలు పెద్దవయ్యాయి. అతడికి జ్వరంకూడా వచ్చింది.

"కిందటిసారి ఎక్సురేలో రంధ్రాలు చిన్నవిగా కనబడ్డాయి కదా."

"అవును ఈ స్టేజిలోనే జాగ్రత్తగాఉండాలి-మళ్లీ పెద్దవికాకుండా మూసుకుపోవటానికి గాని___"

"ఇప్పుడటువంటి అవకాశం కలగకుండా కట్టుబాట్లు చేశానే?" అన్నాడు రవీంద్ర.

డాక్టరు పగలబడి నవ్వాడు. "ఒకసారి అలవాటయిన తరువాత అనేక ఉపాయాలు తోస్తూఉంటాయి సరే. ఇవాళ ఇంజక్షను ఇచ్చేరోజు ఇప్పుడొక డాక్టరు వచ్చిఇస్తాడు మీ ఎదుటనే. పేషంట్ బెడ్‌టికెట్ చూడండి. మీ కన్ని విషయాలు వివరంగా తెలుస్తాయి" అన్నాడు.

అంతలో డాక్టరువచ్చి ఇంజక్షను ఇచ్చాడు.

''ఇట్లా చిన్నవి పెద్దవి కావటం రెండుమూడుసార్లు జరిగింది. పుష్టికరమైన ఆహారం తీసుకొమ్మని అనటంకూడా రంధ్రాలు తొందరగా పూడటానికి తోడ్పడ తాయనే మరి అవేవీపనిచేయని కారణం మీరు గ్రహించే ఉంటారు."

''పరిస్థితులు చక్కబడటానికి అనేకోపాయాలను ప్రయోగించిచూశాను. లాభం కనబడటంలేదని తెలిసిపోయింది. ఇక నాఅదృష్టం ఎలాఉందో అలా జరుగుతుంది" అన్నాడు రవీంద్ర గదిముందర పెద్ద డాక్టరుతో మాట్లాడుతూ.

"డాక్టరయిఉండి అంత నిస్పృహ తెచ్చుకోకండి అందరంకలిసి అతడి మంచి కొరకే ప్రయత్నం చేస్తున్నాంకదా?" అని ముందుకు వెళ్ళాడు. రవీంద్ర అతడి వెనుకనే వెళ్ళాడు.

ఇద్దరు, గది దాటారుకదా అని ఊపిరిపీల్చుకున్నాడు. మధ్యాహ్నమెప్పు డవుతుందాఅని ఆలోచించటం మొదలుపెట్టాడు కాళి.

ఆవేళకు డాక్టరు రవీంద్ర ఏర్పాటుచేసిన అతడు బైట పంపుదగ్గర స్నానం చేసి ధోవతిఆరేవరకూ తడితువాలతో నిలబడ్డాడు. రవీంద్ర అతడికి ఎదురుపడ్డాడు. ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు.

"మీరు నా వెంటరండి అని హాస్పిటల్ భవనంలో పెద్దడాక్టరు గదిలోకి తీసుకెళ్ళి పరిచయంచేశాడు. ఇద్దరి మధ్యా చాలా సేపు సంభాషణనడిచింది.

"మీరివాళ ఒక గంటయిన తరువాత నా గదికిరండి. నేనిచ్చిన సీసాను కాళి గదిలో అతడికి కనబడేటట్టు పెట్టండి. తరువాత సందర్భోచితంగా నడుచు కోండి'' అని ఆయనకి చేయవలసినపనులూ, మాట్లాడవలసిన రీతులూ చెప్పాడు పెద్ద డాక్టరు.

''ఇవాళ మీరు పడుకోలేదేమండీ" అన్నాడు కాళి తన దగ్గరుండే ఆయనతో.

''ఇవాళ నిద్రరాదు కడుపునొప్పిగాఉంది. అన్నట్టు ఒకవార్డుబాయ్ మీదగ్గర ఇదివరలో పనిచేశాడట. అతడు ఒక సీసాను మీ కందించమని బట్టచాటున పెట్టు కుని తెచ్చాడు. ఆ గూట్లోపెట్టాను."

"మీరు నాదగ్గరుంటున్నారని వాడికేం తెలుసు?"

"నేను రోజూ హాస్పిటల్ వెనకవైపున ఉన్న పంపుదగ్గర స్నానంచేస్తూ ఉంటాను. ఎవరని అడిగితే చెప్పేను."

"అఁహాఁ. అయితే మీరు నిద్రపోకపోయినా ఊరికే పడుకుని రెస్టుతీసుకోండి పెద్దవాళ్లు" అన్నాడు కాశి.

"సరే బాబూ. మీరు భోజనం చేశారు. రెండుగంటలకా మూడుగంటలకా మందు వేసుకోవటం?"

"నాకు జ్ఞాపకముంది. టైమయినప్పుడు నేను వేసుకుంటాను. మీరు పడుకోండి" అన్నాడు కాశి. అతడికి ఆ సీసా చూసినప్పటినుంచీ తొందరగా ఉంది.

ఆయన అటుతిరిగి పడుకున్నాడు. అలవాటుపడ్డ ప్రాణి కనుక వెంటనే నిద్ర వచ్చింది ఆయనకు.

కాశి లేచి ఆ సీసాను అటూ-ఇటూ తిప్పి చూశాడు. దానిమీది చీటినికూడా చదివాడు. తను వాడుకునే బ్రేండ్ అది.

ఎవరయినా వస్తారన్న ఆత్రంతో గుటగుట తాగేశాడు. మాట్లాడకుండా కళ్ళుమూసుకుని కప్పుకుని పడుకున్నాడు.

కాశి మూడుగంటలకు లేచాడు. ఏమిటో ఇంకా మత్తుమత్తుగా ఉంది. తను మాత్ర వేసుకుని హార్లిక్సు తాగేవేళని జ్ఞాపకం ఉంది.

"ఏమండీ. హార్లిక్సు కలిపి ఇవ్వండి" అని గట్టిగా పిలిచాడు. మాత్ర వేసుకుని.

ఆయన మెలకువతోనే ఉన్నాడు. దిగ్గున లేచి హార్లిక్సుకలిపాడు. ఆయన చేతికిస్తుంటే "వార్డుబాయ్ ఇచ్చిన సీసా ఇదివరకూ మాదిరిగా లేదని చెప్పండి మీకు కలిసినప్పుడు. రుచిగానే ఉందిగాని అది తాగినట్టుగా లేదు."

"సరే బాబూ. నాకు రోజూ పంపుదగ్గర కలుస్తూనే ఉంటాడు."

"డబ్బుడిగాడా?"

"రేపివ్వచ్చునన్నాడు"

సరే ననుకుంటూ మళ్ళీ నిద్రకొరిగాడు కాశి.

డాక్టర్లు వేళకు వస్తున్నారు - చూస్తున్నారు. నర్సులూ సిస్టర్లూ వాళ్ళవెంబడే ఉంటున్నారు.

"ఏమండీ మీ పేరు చెప్పలేదూ?" కాశీ అడిగాడు.

"నా పేరు విశ్వేశ్వరరావు"

"చాలా పొడుగ్గా ఉంది. రావుగారూ అంటే పలుకుతారా?"

"ఎందుకు పలకను? మీరు పడుకున్నప్పుడు మీ నాన్నగారు వచ్చారు డాక్టర్లతో. రిపోర్టు చూసి వెళ్ళిపోయారు. రేపు రక్తపరీక్షట."

"ఎన్ని పరీక్షలయినా చేసుకోమనండి. వార్డుబాయ్ కలిశాడా? డబ్బిడి గాడా?"

"అడగలేదు. కాని- ఒక్కసారి పెద్దమొత్తంయిస్తే యింటిఖర్చుకు వస్తుం దన్నాడు."

"సరేనుకుంటూ సీసా చూసుకుని అంతా తాగేసి లోపలపెట్టి తలుపు వెయ్యండి" అన్నాడు.

"ఇంత ఖర్చుచేసి అదేసీసా తీసుకువస్తున్నాడు. కాని- తీసుకున్నప్పటినుంచీ ఒకటే నిద్రమత్తు. పైగా కొత్తరకం అంటున్నాడు."

"సరేలేండి. వాడు తెచ్చినది తీసుకుంటేనేమంచిది. పైకి పొక్కకుండా ఉంటుంది" అని పడుకున్నాడు.

ఆ నిద్ర సాయంత్రం ఐదింటికి లేపి కూర్చోబెట్టింది. బ్రెడ్ పాలు ఒక మాత్ర రావుగారిస్తే తీసుకున్నాడు.

తెల్లవారి రక్తపరీక్ష అయింది. వాళ్ళల్లోవాళ్ళు ఏదో మాట్లాడుకున్నారు. తరువాత డా॥ రవీంద్ర వచ్చాడు.

"కాశీప్రసాద్‌గారు ఎలా ఉన్నారు? రావుగారి సర్వీసెస్ బాగా ఉన్నాయా? ఏమయినా కంప్లెయింట్లు ఉన్నాయా?" కుర్చీమీద కూర్చుని కొడుకు ముఖంలోకి చూశాడు రవీంద్ర.

"చూస్తున్నారుగా? ఇవాళ బ్లడ్‌టెస్టు మీకు రిజల్ట్సు చెప్పేఉంటారు. నేని

ప్పుడు దేన్నిగురించీ ఆలోచించటంలేదు. ఎవరయినా రానీ. ఏ పరీక్షయినా చేయనీ" అన్నాడు విసుగ్గా కాశి.

"కాశీ, ఎవరు ఏదిచేసినా నీ మంచికేనని ఇదివరలో చెప్పానుగదరా? మన బాలూ బాగా చదువుతున్నాడని స్కూలువాళ్ళు ఒక ప్రైజు ఇచ్చారు. చాలాసంతోషంగా ఉన్నాడు. నీకు చెప్పమన్నాడు."

"పోనీ వాడినయినా బాగుపడనీయండి"

"ఏం? నీవు చెడిపోయాననుకుంటున్నావా ?"

"మరి ఇదంతా ఏమిటి? ఆరునెలలు దాటవచ్చాయి. అతీగతీలేదు. ఇక్కడ పడున్నాను."

"దీనికీ చదువుకూ ఏం సంబంధం? నీవు తక్కువ చదివావా? మంచి మార్కులు రాలేదా? ఉద్యోగం మంచిది కాదా? అసలు నీవలా ఎందుకనుకుంటు న్నావో నాకర్థం కాలేదు. ఇదిపోనీ. నీకలా అనిపిస్తే అనిపించవచ్చు, రాజీనీ, అమ్మనూ చూస్తావా పంపిస్తాను?"

"రావాలనుకుంటే రమ్మనండి. బలవంతం ఏం లేదు'' అన్నాడు.

"సరే, నేను వెళ్తాను. ఇంకా ఇంటికి రాలేదని అమ్మ ఎదురుచూస్తుంది'' అంటూ వెళ్ళిపోయాడు. భార్యతో చెప్పాడు- "వాడికి నామీద ఎంత కసిగాఉందో చెప్పలేను. ఆ హాస్పిటల్లో ఉంచానని సరిగా మాట్లాడటం కూడా మానేశాడు. మీ రిద్దరూ ఇవాళ వెళ్తారా? పంపిస్తానని చెప్పాను."

"వెళ్తాం. గాని ఏం మాట్లాడతాడో? ఉండమంటాడేమో? అంటే ఉండ మంటారా? నేను కాకపోయినా రాజీని?"

''వాడు మిమ్మల్ని ఉండమని అడగడు. రావుగారు వాడికి నచ్చారు. చూసిరండి."

తల్లితో, భార్యతో అతడేమీ సంతోషంగా మాట్లాడలేదు. వాళ్ళు చెప్పింది విన్నాడు. బాలూ సంగతి చెప్పగానే ఒక నవ్వు నవ్వాడు. అది మామూలునవ్వు కాదు, అది విరాగి నవ్వే నవ్వు. నిర్వికారంగా ఉంది.

అలా ఏడాది ఉన్నాడు కాళి ఆహాస్పిటల్లో. ఈలోపల పెద్దడాక్టరు "అబ్బాయికి ఈ ఊరు ట్రాన్స్ఫరు చేయించటానికి వీలయితే ప్రయత్నించండి. మీ యింట్లోనే ఉంచుకోండి, ఇంకొక బిడ్డ పుట్టకుండా కోడలికి ఆపరేషను చేయించండి. ఇంకో నెలలో ఇంటికి తీసుకువెళ్ళచ్చు. చెకప్‌లకి రావాలి. ఉద్యోగంలో చేరినా అతడి డ్యూటీ కూడా నైట్‌డ్యూటీ కాకుండా ఉంటే మంచిది." అన్నాడు పెద్దడాక్టరు.

"వయసులో ఉన్నవాడికి జీవితంలో ఇన్ని నిబంధనలా? ఇందులో ఎవరు మాత్రం చేయగలిగింది ఏముంది? ఉన్నదాంట్లో సదుపాయాలు చేయగలం కాని- అంతా మామూలుగా ఉండేటట్టు చెయ్యలేం కదా?" అనుకున్నాడు.

రావు తెస్తున్న సీసాలు తాగటం మొదలుపెట్టినప్పటినుంచీ కాళిలో ఉత్సాహం లేదు. అతడి మనసు పూర్తిగా మారిపోయినట్లయింది.

ఇంటికి వచ్చేనాడు అతడిని తండ్రి డాక్టర్లందరి దగ్గరికి తీసుకువెళ్ళాడు. వాళ్ళు ఎన్ని ప్రశ్నలు వేసినా ఇంటికి వెళుతున్నానన్న సంతోషంతో జవాబు ఇవ్వలేదు. అతడి పక్షాన తండ్రే అందరికీ కృతజ్ఞతలు చెప్పి డబ్బు చెల్లించి ఇంటికి తీసుకువచ్చాడు. రావుగారు అతడివెంబడే ఉండటంచూసి ఆశ్చర్యపడ్డాడు కాళి.

"మీరుకూడా నాతోపాటేనా?" అన్నాడు కాళి.

"అవును బాబూ."

నాన్న వచ్చాడని బాలూ గంతులువేస్తూ ఎగిరి మంచమ్మీద కూర్చున్నాడు. అతడితో కూడా ఆప్యాయంగా మాట్లాడలేదు కాళి.

"ఏం నాన్నా! మాట్లాడవా? ఇదివరకూ నాకు కథలు చెప్పేవాడివి, బైటికి తీసుకువెళ్ళేవాడివి, ఇప్పు డింటికి వచ్చావుగా! ఇప్పుడు చెప్పవచ్చుగా?" అన్నాడు గడ్డం పట్టుకుని.

"అన్నీ మర్చిపోయానురా. మళ్ళీ చదివి చెప్తానులే" పంపించేశాడు. ముఖం చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయాడు బాలూ.

"ఎందుకురా పిల్లవాడిని అలా పంపించేశావు? వాడు ఏడుస్తున్నాడు. మీ నాన్న చెప్పారు. మేడమీద వేరే సామాను తీసేసి నీ సామాను సర్దించమన్నారు.

"సరే. ఆయన చెప్పినట్టే చెయ్యి" అన్నాడు పొడిమాటలుగా కాళి.

"బైటికి వెళ్ళాలంటే మెట్లుకూడా బైటికే ఉన్నాయి."

''తెలుసు.''

"నిన్ను ఏ. జి. ఆఫీసులో వేశారట. జాయినింగు డేట్ వచ్చేనెల మొదటితేది."

"ఆర్డరు అందింది."

"నీకు నీరసంగా ఉందా అట్లా ఉన్నావు?" తల్లి మంచమ్మీద కూర్చుని భుజమ్మీద చెయ్యేసి అడిగింది.

"నీరసం ఏముంది? తిండి బాగానే పెడుతున్నావుగా? మొత్తంమీద శేరు పాలు, రెండు గుడ్లు ఇంత పౌష్టికాహారం లోపలికి నెట్టుతుంటే నీరసంఏమిటి?"

"నీ శరీరం బాగానే ఉండచ్చుగాని, నీ మనసు ఉల్లాసంగా ఉన్నట్టు లేదు. రాజీతో కూడా సరిగా మాట్లాడలేదట. అదీ ఏడుస్తున్నది బాలుకూడా ఒకటే ఏడుపు. ఈ వయసులో నన్నెందుకురా బాధపెడతావు?" సుమిత్ర కన్నీళ్ళు తుడుచుకుంది.

"నే నెవరినీ బాధపెట్టటంలేదు. నన్ను చూసి మీరే బాధపడుతున్నారు."

సుమిత్ర ఈ సంగతి రవీంద్రకు చెప్పింది. రవీంద్ర ఆ మరునాడు టి.బి. హాస్పిటల్ పెద్దడాక్టరు దగ్గరికి వెళ్ళాడు.

ఆయన అంతా విని సీసాలు అలవాటయినవాళ్ళకు దాన్ని మాన్పించగానే పిచ్చెక్కినట్టుగా ఉంటుంది. మందు నరాలను, రక్తాన్ని ఉద్రేకపరిచి ఉల్లాసాన్ని కలిగిస్తుంది. అది అందకపోతే నరాలు చచ్చుపడినట్లనిపిస్తుంది. ఆ ఉల్లాసం, ఉద్రేకం ఉండవు. అందులో నేను అతడికి ప్రతిరోజూ పంపించే సీసాలో ఆ మందుమీద ఉండే కోరికను నశింపచేయటానికి మత్తుమత్తుగా ఉండే మందు కలిపి ఒకవిధంగా ఆ రుచిని కల్పించి పంపేవాడిని. నిజానికి అతడికిప్పుడు ఆ బుడ్డి మీద కోరిక లేదు. అది లేనందువల్ల శారీరకబాధ తప్ప మరేంలేదు. ఊపిరి తిత్తులుకూడా బాగుపడ్డాయి. కాని - డాక్టర్లుచెప్పిన మందులు తీసుకుంటూ జాగ్రత్తగా ఉండాలి. ఉద్యోగంలో చేరితే ఈ చికాకులు తగ్గుతాయి. మీరు అతడిమీద

సింపతీ చూపించండి కాని అపార్థంచేసుకోకండి" అని విప్పిచెప్పాడు రవీంద్రకు.

"నాకర్థమైంది. మావాళ్ళందరికీ చెప్తాను" ఇల్లు చేరుకున్నాడు.

కోడలినీ భార్యనూ పిలిచి "మీరు వాడిని ఊరికే ప్రశ్నలువేసి విసిగించకండి. కాశీని మామూలుగా చూడండి. మెల్లగా అలవాటుపడతాడు. వాడు ఏ విషయంలో నయినా తొందరపడితే మీరు మాట్లాడకుండా సర్దుకుపోండి. మనం చాలా పెద్ద ప్రమాదంలో నుంచి బయటపడ్డాము వాడికిది పునర్జన్మ అనుకోండి. రావుగారు వాడివెంబడే ఉంటారు అన్నాడు

"ఆఫీసులో ఎవరయినా మళ్ళీ ఈ వ్యసనంలోకి దింపుతారేమోనని నా భయం'' అంది రాజి.

"నీకా భయం అక్కరలేదు. ఈ విధంగా డాక్టర్లు ఎందరినో బాగుచేశారు. వాడికీ బాగా అనుభవమైంది. ఎంతో కష్టపడ్డాడు. గిలగిల్లాడేడు. ఆ సమయానికి సమయానుకూలంగా డాక్టర్లు చేసిన సహాయం మరువరానిది'' అన్నాడు.

అందరి ముఖాలూ వికసించాయి.

రావుగారు తనను డ్యూటీలోనుంచి ఇంక తీసేస్తారేమోనని భయపడ్డాడు. కాని డా॥ రవీంద్ర నవ్వుతూ ''మీరు మా యింట్లోనే'' అన్నాడు. పైగా జీతం కూడా ఎక్కువ చేశాడు.

"ఇంకా నా సర్వీసుతో పనుందా డాక్టరుగారూ!"

"ఉందనేగా జీతం ఎక్కువచేశాను? కాశీప్రసాద్ కారులో మీకొక సీటు ఎప్పుడూ ఉంటుంది. అయితే మీరింకా సీసాలు తీసుకురావలసిన పని మాత్రం ఉండదు. మీరు అతడికి పి.ఏ. అనుకోండి. ఆఫీసులో అయినా మీరు బయట కూర్చోండి. మీరు యస్సైగా పనిచేశారుగా? అటువంటి మనుష్యులను కనిపెట్టి వాడి దరిజేరనివ్వకండి. ఆఫీసునుంచి ఇంటికి వచ్చినతరువాత భోజనాలయేవరకూ ఉండి ఇంటికివెళ్ళండి. మాకు మీరెంత సహాయం చేశారో నేనిప్పుడు చెప్పలేను" డా॥ రవీంద్ర అతడి చెయ్యి అందుకున్నాడు షేక్‌హ్యాండ్ ఇవ్వటానికి.

కాశీప్రసాద్ డ్యూటీలో చేరాడు. అందరితో ముక్తసరిగా మాట్లాడుతూ పని చేస్తున్నాడు. వేళకు ఇంటికి వస్తున్నాడు. కాశీకోసం తండ్రి కూడా త్వరగా

ఇంటికి వస్తున్నాడు. తండ్రితోపాటు కాఫీ, టిఫిన్ తీసుకుంటాడు.

క్రమంగా బాలూను దగ్గరికి పిలవటం, కథలు చెప్పటం సాగించాడు. చిన్నప్పుడు చేసినట్టుగా తల్లిదగ్గర కూర్చుని మాట్లాడుతున్నాడు.

రాజితోకూడా సినెమాకు వెళ్ళినా రావుగారు తన సీట్లో కూర్చుంటారు. ఆయన మాత్రం తన డ్యూటీ ఏమారటం లేదు.

కాశీప్రసాద్‌ని చూసి తండ్రి చాలా సంతృప్తిగా ఉన్నాడు. ఇది అతడికి ఇష్టమైన పండుగలా ఉంది. ఈ పండుగరోజులకు అంతరాయం కలుగకూడదని అతడి ఆకాంక్ష. గడిచిన రోజులు మాత్రం జ్ఞాపకం రాకుండా వుండవు.